క్లుప్తంగా

సావిత్రమ్మ మృతికి సంతాపం


సావిత్రమ్మ(ఫైల్)

గరుగుబిల్లి: ప్రముఖ వైద్యనిపుణుడు ద్వారపు రెడ్డి రామ్మోహనరావు తల్లి సావిత్రమ్మ(93) మంగళవారం పార్వతీపురంలో మృతి చెందారు. బుధవారం ఆమె మృతదేహాన్ని స్వగ్రామం కొత్తూరుకు తరలించి, అంత్యక్రియలు నిర్వహించారు. ఆమె మృతి పట్ల పలువురు రాజకీయ నాయకులు, అధికారులు, వైద్యులు, ప్రముఖులు సంతాపం తెలిపారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు.

సారా బట్టీపై దాడులు

భామిని: మండలంలోని మనుమకొండ సమీపంలో నిర్వహిస్తున్న సారా బట్టీపై బత్తిలి ఎస్‌ఐ డి.అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్‌ఐ రమణమూర్తి సారథ్యంలో పోలీసు సిబ్బంది బుధవారం దాడులు జరిపి సారా ఊటలను ధ్వంసం చేశారు. సారా తయారీ పొయ్యితో పాటు బెల్లం ఊటలు వేసిన సామగ్రిని ధ్వంసం చేశారు. సుమారు 30 ప్లాస్టిక్ డ్రమ్ములు ధ్వంసం చేసి సుమారు 1600 లీటర్ల ఊటలు ధ్వంసం చేశారు.

ఘనంగా సత్సంగ సమావేశం

పాలకొండ: మండలంలోని చినమంగళాపురం గ్రామంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న సత్సంగ సమావేశాలు బుధవారం ఆధ్యాత్మిక ప్రసంగాలతో సాగింది. గుంటూరు జిల్లా నంబూరుకు చెందిన శ్రీ చంద్రకాళీ ప్రసాద మాతాజీ ఆధ్వర్యంలో గ్రామంలో మేలుకొలుపు, ప్రార్థనలు, పుణ్యవచన కార్యక్రమాలను నిర్వహించారు. విశ్వహిందు పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రకాళీ ప్రసాద మాతాజీ మాట్లాడుతూ హిందు ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఆధ్యాత్మిక వేత్తలు పాల్గొని ప్రసంగించారు.

నేమ్‌బోర్డుల ఏర్పాటు

గరుగుబిల్లి: మండలంలోని పెద్దూరులో పలు వీధుల వద్ద ఆ వీధుల పేర్లను తెలిపే నేమ్‌బోర్డులను బుధవారం ఏర్పాటు చేశారు. గ్రామంలోని అన్ని వీధులను చాలా సులభంగా గుర్తించేలా గ్రామానికి చెందిన శ్రీగౌరీశంకర భజన బృందం సభ్యులు చింతాడ సింహాచలం, తెర్లి ఎల్లంనాయుడు, గంట సింహాచలం, లచ్చుపతుల చిన్నారావు, ఉమామహేశ్వరరావు, రామ్మూర్తి తదితరులు ధనుర్మాసంలో నిర్వహించిన మేలుకొలుపు కార్యక్రమం ద్వారా దాతలు ఇచ్చిన చందాలతో బోర్డులు కొనుగోలు చేసి, ఏర్పాటు చేశామన్నారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ తప్పనిసరి

భామిని: మెట్ట పంటలకు ప్రత్యామ్నాయ పంటగా సాగుతున్న మొక్కజొన్న పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏఓ కె.సింహాచలం అన్నారు. మండలంలోని పసుకుడి, బిల్లుమడ గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు పలు సూచనలు చేశారు. మొక్క దశలో ఉన్న పంటకు కాస్త ఎరువులు అందించాలన్నారు. నీరు తడి పెట్టి చీడపీడల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. బురుజోల, నులకజోడు ఏఏలు కె.తేజ, భాగ్యలక్ష్మి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోనేరు అభివృద్ధికి చర్యలు

పాలకొండ: పట్టణంలోని వెంకటరాయుని కోనేరు అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ తెలిపారు. బుధవారం ఆయన కోనేరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణం మధ్యలో ఉన్న ఈ కోనేరు ఆహ్లాదకరంగా మార్చేందుకు నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. బోటు షికారుకు అవసరమైన ప్రతిపాదనలు చేయాలని కమిషనర్ సర్వేశ్వరరావుకు సూచించారు. కోనేరు చుట్టూ సుందరీకరణ కోసం అంచనాలు తయారు చేయాలని సూచించారు. ఆయనతో పాటు నగర పంచాయతీ కౌన్సిలర్లు ఉన్నారు.

ఆధార్ క్యాంప్‌ల పరిశీలన

సీతంపేట: ప్రతీ వ్యక్తికి ఆధార్ కార్డు నమోదు చేయించడం కోసం ఆధార్ క్యాంపులు నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ గీతాంజలి తెలిపారు. ఆధార్ క్యాంప్‌ను బుధవారం పరిశీలించారు. మండ గ్రామంలో ఆధార్ కార్డు నమోదు కాని చిన్న పిల్లలకు ఆధార్ నమోదు చేయించడం జరిగిందన్నారు. తప్పనిసరిగా ఆధార్ కార్డుకు మొబైల్ లింక్ చేయాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ


అయ్యప్ప కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి తదితరులు

పాలకొండ రూరల్: పట్టణంలోని నాగవంశపు వీధిలో నివాసముంటున్న ఆనాపు అయ్యప్ప (80) ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం వారి స్వగృహానికి వెళ్లారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కౌన్సిలర్లు పల్లా భాను, కొంచాడ అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

నగర పంచాయతీలో ఉద్యోగుల కొరత!

- కీలక పోస్టులన్నీ ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్న వైనం
- క్షేత్ర స్థాయిలో కొరవడుతున్న పర్యవేక్షణ


పట్టణంలో పేరుకుపోయిన చెత్తాచెదారం



పాలకొండ నగర పంచాయతీ కార్యాలయం

పాలకొండ రూరల్: దశాబ్ద కాలం కిందట పాలకొండ మేజర్ పంచాయతీ నగర పంచాయతీ స్థాయిని దక్కించుకుంది. అయితే పలు విభాగాల్లో అవసరమైన సిబ్బంది లేకపోవడంతో అభివృద్ధిలో వెనుకడుగు వేస్తోంది. పాలక వర్గాలు తీసుకునే నిర్ణయాలు క్షేత్ర స్థాయిలో అమలు చేసేందుకు అధికార యంత్రాంగం కీలకం. స్థాయి పెరిగినా అవసరమైన అధికారులు లేకపోవడంతో ముఖ్య విభాగాల్లో ఆశించిన మేరకు పురోగతి కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో సచివాలయ వ్యవస్థలో కొందరు సిబ్బంది సమన్వయంతో కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు.

కీలక విభాగాల్లో...

పూర్తి స్థాయి, అనుభవజ్ఞులైన అధికార యంత్రాంగం లేక కీలక విభాగాలు వెలవెలబోతున్నాయి. ముఖ్యంగా అభివృద్ధి పనుల గుర్తింపు, అంచనాలు సిద్ధం చేయటంలో ముఖ్య భూమిక పోషించటంతో పాటు, పనుల పర్యేక్షణ, నాణ్యత పరిశీలన వంటి అంశాలను చూసుకునే ఇంజినీరింగ్ వ్యవస్థలో ఏఈ (సహాయక ఇంజినీర్) పోస్టు సంవత్సరాలుగా ఖాళీగా ఉంది. రూ.కోట్ల మేర అభివృద్ధి పనుల నిర్వహణతో పాటు, వీధి దీపాల నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి కనీస మౌలిక సదుపాయాలు ఈ శాఖ పరిధిలో ఉంటుంది. పలు ఆర్థిక సంఘాల ద్వారా నగర పంచాయతీకి సమకూరిన నిధులు పనులకు వెచ్చించటంతో పాటు ఖర్చులు, ప్రజలకు ఆమోద యోగ్యమైన పనులు చేయించటం ఇంజినీరింగ్ శాఖ పరిధిలో ఉంటుంది. ఈ వ్యవస్థల్లో పూర్తి స్థాయి అధికారి లేక సచివాలయ సిబ్బంది సమన్వయంతో విధులు చేపడుతున్నారు. దీనికి తోడు పట్టణ ప్రణాళికా విభాగం అధికారి పోస్టు కూడా ఖాళీగా ఉంది. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ, వినియోగదారులకు అందించే వివిధ వ్యాపార సంస్థలు విక్రయించే ఆహార పదార్థాల నాణ్యతను నిత్యం పరిశీలించే శానిటరీ అధికారి కూడా లేరు.

20 వార్డుల పరిధిలో..

నగరపంచాయతీ పరిధిలో 20 వార్డుల్లో దాదాపు వందకు పైబడి వీధులుండగా 40వేల పైచిలుకు జనాభా ఉన్నారు. నాలుగు రక్షిత పథకాల ద్వారా 15 వందల పైచిలుకు వ్యక్తిగత, 3 వందల మేర వీధి కుళాయిల ద్వారా తాగునీరు అందించాల్సి ఉంటుంది. పట్టణంలో 110 చేతి బోర్లు ఉన్నాయి. 1400 వీధి దీపాలు ఉండగా ఇవి కొన్ని చోట్ల పగలు వెలుగుతున్నాయి. వీధి కుళాయిలకు ట్యాప్‌లు అమర్చకపోవటంతో రక్షిత నీరు పెద్దెత్తున వృథాగా పోతుంది. గారమ్మ, ఇందిరానగర్‌తో పాటు పలు కాలనీల్లో మౌలిక వసతులు కొరపడుతున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన కీలక పోస్టులు భర్తీ జరగకపోవటంతో ఇబ్బందులు తప్పటం లేదు. దీనికి తోడు రానున్న వేసవిని తలచుకుని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ప్రస్తుతం...

ప్రస్తుతం నగర కార్యాలయంలో కమిషనర్‌తో పాటు మేనేజర్, ఆర్‌ఐ, ఒక సీనియర్ సహాయకులు, ఇద్దరు జూనియర్ సహాయకులతో పాటు అకౌంటెంట్ ఉన్నారు. 5 మంది సయివాలయ, ఐదుగురు రెగ్యులర్, మరో 50 మంది వరకూ ఔట్ సోర్సింగ్ విధానంలో పారిశుధ్య, ఇతర విభాగాల్లో సేవలు అందిస్తున్నారు. పూర్తి స్థాయి అధికారులు సమకూరితే అభివృద్ధిలో వేగంతో పాటు, పనుల్లో నాణ్యత మెరుగుపడుతుందని నగర వాసులు పేర్కొంటున్నారు.

అనుభవజ్ఞులు అవసరం



రోజురోజుకూ పట్టణంలో ప్రజల అవసరాలు పెరుగుతున్నాయి. అందుకు తగ్గట్లు అధికారులు అవసరం ఉంది. ప్రస్తుతం నగర కార్యాలయంలో కీలక విభాగాల్లో ఇన్‌చార్జిలు కొనసాగుతున్నారు. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్, శానిటరీ తదితర అధికారులు లేరు. దీంతో సంబంధిత పనులపై వచ్చే ప్రజలు అవస్థలు పడుతున్నారు. పూర్తి స్థాయి అధికారులు లేక పట్టణంలో అభివృద్ధి, పారిశుధ్య పనుల పర్యవేక్షణ సచివాలయ సిబ్బంది చేపడుతున్నారు.

– టీకే రామకృష్ణ, పాలకొండ

ప్రజలకు ఇబ్బందులు లేకుండా..



ఉన్న సిబ్బంది సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందిస్తున్నారు. అవసరమైన చోట నేరుగా నేను క్షేత్ర స్థాయిలో పర్యటించి, సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకుంటున్నాను. కీలక పోస్టుల భర్తీకి సంబంధించి శాఖాపరమైన అర్జీలను ఉన్నతాధికారులకు అందించటం జరిగింది. త్వరలో పూర్తి స్థాయి అనుభవజ్ఞులైన అధికారులు సమకూరే అవకాశాలున్నాయి.

– సామంచి సర్వేశ్వరరావు, కమిషనర్, నగ పంచాయతీ, పాలకొండ

గులిరాగి పద్ధతిలో అధిక దిగుబడులు


రాగి పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

సీతంపేట: గులిరాగి పద్ధతిలో సాగు చేయడంతో అత్యధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం రీజనల్ అధికారి ప్రకాశరావు, ఆర్‌టీట హేమసుందరరావు అన్నారు. మండలంలోని చిన్న బగ్గ, గూడగుడ్డి గ్రామాల్లో పలువురు రైతులు సాగు చేస్తున్న రాగి పొలాలను వారు బుధవారం పరిశీలించారు. జీడి మామిడి తోటల్లో వేసిన మారిషస్ పైనాపిల్ పంట పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఏ మునలయ్య, డివిజనల్ ఇన్‌చార్జ్ బాలు, వెలుగు డైరెక్టర్ సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలను అంచనా వేయాలి


విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

పాలకొండ రూరల్: అగ్ని ప్రమాదాలను ముందుగానే అంచనా వేసి అవి జరగకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలని అగ్నిమాపక శాఖ అధికారి జామి సర్వేశ్వరరావు అన్నారు. మండలంలోని ఓని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రమాదాల నివారణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. బుధవారం శకటంతో సహా పాఠశాలకు చేరుకున్న అధికారులు కృత్రిమ అగ్ని ప్రమాదాలను సృష్టించి, వాటిలో చిక్కుకున్న బాధితులను సురక్షితంగా రక్షించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు అనుసరించాల్సిన మెలకువలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం బలగ నాగమని, ఉపాధ్యాయులు గోగుల సూర్యనరాయణ, సిద్ధాభక్తుల వెంకటరయణ, భవర్తి కేశవరావు తదితరులున్నారు.

పాడి అభివృద్ధికి సమన్వయంతో కృషి :జేడీ

పాలకొండ రూరల్: క్షేత్ర స్థాయి నుంచి పశుపోషకులు, పాడి రైతులు, అధికారుల సమష్టి సమన్వయంతో పాడి అభివృద్ధి సాధ్యమని పశుసంవర్ధక శాఖ జేడీ డాక్టర్ శివ్వాల మన్మధరావు అన్నారు. పశు ఆరోగ్య రక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని బద్దుమాసింగి, లుంబూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన శిబిరాల్లో బుధవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు ఆరిక వెంకటేష్, టి.ఉపేంద్రకుమార్, నిమ్మక ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ అధిక శాతం గ్రామీణులు వ్యవసాయంతో పాటు పశుపోషణ ద్వారా జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తరఫున అన్ని విధాలా పాడి రైతులకు సహకరించాలన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ శరత్‌చంద్ర సీజన్ల ప్రాప్తికి పశువులకు సంక్రమించే వ్యాధుల లక్షణాలు, వాటిని సకాలంలో గుర్తించటం, అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. వివిధ ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్న 292 పశువులకు అవసరమైన చికిత్సతో పాటు మందులను వాటి సంరక్షకులకు అందించారు. కార్యక్రమంలో సంబంధిత శాఖ ఏడీ ప్రభా మాణిక్యరావు, వైద్యాధికారి బి.సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

పాలవలస కుటుంబానికి పలువురి పరామర్శ


రెడ్డి శాంతిని పరామర్శిస్తున్న రవికుమార్ తదితరులు

పాలకొండ: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాలవలస రాజశేఖరం కుటుంబాన్ని పలువురు బుధవారం పరామర్శించారు. సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా కార్యదర్శి నల్లబిల్లి సుభాషిని, నల్లబిల్లి విశ్వేశ్వరరావు తదితరులు పాలవలస రాజశేఖరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజశేఖరం కుమార్తె, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతిని పరామర్శించారు.

జీసీసీ కొనుగోలు కేంద్రాల వద్దే విక్రయించాలి


అవగాహన కల్పిస్తున్న గుమ్మలక్ష్మీపురం జీసీసీ గొడౌన్ సూపరింటెండెంట్ సాంబశివరావు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): అటవీ ఉత్పత్తులను జీసీసీ కొనుగోలు కేంద్రాల వద్దే విక్రయించాలని గుమ్మలక్ష్మీపురం జీసీసీ గొడౌన్ సూపరింటెండెంట్ ఎం.సాంబశివరావు తెలిపారు. జీసీసీ డీఎం, బీఎంల ఆదేశాల మేరకు గుమ్మలక్ష్మీపురం మండల కేంద్రంలో బుధవారం జరిగిన వారపు సంత వద్ద జీసీసీ కొనుగోలు కేంద్రాల వద్ద అటవీ ఉత్పత్తుల సేకరణ, కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వస్తు నాణ్యతా ప్రమాణాలు, చెల్లిస్తున్న ధరలపై బుధవారం అవగాహన కల్పించారు. జీసీసీ కొనుగోలు కేంద్రాలతో పాటు డీఆర్ డిపోల వద్ద కూడా అటవీ ఉత్పత్తుల కొనుగోలు చేయడం జరుగుతుందని, తక్షణమే నగదు అందజేయడం జరుగుతుందన్నారు. అనంతరం అటవీ ఉత్పత్తులకు జీసీసీ చెల్లిస్తున్న ధరలతో కూడిన కరపత్రాలను గిరిజనులకు పంచిపెట్టారు. కార్యక్రమంలో సేల్స్‌మేన్లు సన్యాసిరావు, జగదీష్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీర్‌సింగ్ ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. 2025-26 విద్యాసంవత్సరానికి గాను ఆరో తరగతిలో 60 సీట్లు భర్తీ చేయనున్నామని, ఈ సీట్లలో 30 సీట్లు బాలురుకు, మరో 30 సీట్లు బాలికలకు కేటాయించడం జరుగుతుందన్నారు. అర్హులైన వారంతా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులను రాత పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తామన్నారు. 31.03.2025 నాటికి 10 ఏళ్ల వయసు నిండి 13 ఏళ్ల వయసులోపు వారు, 2024-25 విద్యాసంవత్సరంలో ఐదో తరగతి చదివిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో సీబీఎస్‌ఈ సిలబస్ ప్రకారం విద్యాబోధన ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు చివరి తేది 19.02.2025 అని, 25.02.2025 తేదీన రాతపరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

హెల్మెట్‌ధారణ తప్పనిసరి

సీతంపేట: హెల్మెట్‌ను ప్రతీ ఒక్కరూ ధరించాలని ఎస్‌ఐ వై.అమ్మన్నరావు సూచించారు. స్థానిక అడ్వెంచర్ పార్కు వద్ద బుధవారం వాహన చోదకులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మితిమీరిన వేగంతో వెళ్లొద్దని కోరారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని లైసెన్సులు కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాల ఇవ్వవద్దన్నారు. మత్తు పదార్థాల వినియోగం తదితర అంశాలపై వివరించారు.

వేతనదారులకు పనులు కల్పించాలి

జియ్యమ్మవలస: ఉపాధి హామీ పథకం వేతనదారులకు 'ఉపాధి' పనులు కల్పించి, పాతమేట్‌లనే కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. ఇదే విషయమై మండలంలోని తుంబలి గ్రామంలో ఉపాధి వేతనదారులతో కలిసి బుధవారం నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ పనులు పూర్తయి రెండు నెలలు గడుస్తున్నా ఉపాధి పనులు ప్రారంభం కాకపోవడంతో చాలామంది వలస వెళ్లిపోతున్నారన్నారు. సకాలంలో ఉపాధి పనులు జరిగేలా చూస్తే వేతనదారులు వలస వెళ్లరన్నారు. ప్రభుత్వం మారినప్పుడల్లా ఉపాధి మేట్‌లను మారుస్తున్నారని, ఇది సరికాదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బి.మోహనరావు, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

డీసీటీఓ తనిఖీలు

వీరఘట్టం: వీరఘట్టం – పాలకొండ సీఎస్‌పీ రోడ్డులో బుధవారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన డీసీటీఓ పద్మజానాయుడు తమ సిబ్బందితో పలు లగేజీ వాహనాలను తనిఖీ చేసారు. బిల్లులు లేకుండా శ్రీకాకుళం నుంచి వీరఘట్టం వస్తున్న ఒక బీరువాల వ్యాన్‌ను, ఆమదాలవలస నుంచి వీరఘట్టం వస్తున్న వాటర్ బస్తాల వ్యానులను బిల్లులు పరిశీలించారు. వీరఘట్టం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న స్క్రాప్ వ్యాన్‌ను ఇలా పలు లగేజీ వాహనాలను ఆపి తనిఖీలు చేసారు.

● ఆస్పత్రికి రోగుల తాకిడి


ఈ చిత్రంలో కనిపిస్తున్న జనాలు సీతంపేట ఏరియా ఆస్పత్రి ఓపీ గేటు వద్ద వేచి ఉన్న రోగులు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులు బుధవారం పెద్ద సంఖ్యలో ఆస్పత్రికి రావడంతో కిక్కిరిసిపోయారు. ఒకే రోజు 370 మంది వైద్యం కోసం ఏరియా ఆస్పత్రికి వచ్చారు. వైద్యాధికారులు రోగులకు రక్త పరీక్షలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. - సీతంపేట

చేపపిల్లల పంపిణీ


దుమ్మంగిలో చేపపిల్లలు అందజేస్తున్న దృశ్యం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుమ్మంగి గ్రామంలో ఉన్న చేపపిల్లల ఉత్పత్తి, పంపిణీ కేంద్రం వద్ద పలువురు రైతులకు చేపపిల్లలు బుధవారం పంపిణీ చేశారు. మొత్తం 49 మందికి 79 వేల ఫింగర్ లింగ్ పరిమాణం కలిగిన రాగండి, ఎర్రమైలు రకాల చేపపిల్లలను సర్పంచ్ పాలక క్రాంతికుమార్, ఇరిడి ఎంపీటీసీ సభ్యుడు కె.మల్లేశ్వరరావుల చేతులమీదుగా అందజేశారు. మత్స్య సంపదను ప్రోత్సహిస్తూ పార్వతీపురం ఐటీడీఏ తరఫున వీటిని ఉచితంగా ఇవ్వడం జరుగుతోందని ఎఫ్‌డీవో గోపీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో గిరిజన మత్స్యకార సంఘం ప్రెసిడెంట్ బి.సుదర్శనరావు, గిరిజన నాయకుడు ఎం.భూషణరావు, వీఎఫ్‌ఏ వెంగలరాయుడు తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని పరజపాడు గ్రామంలో ఉన్న జగన్నాథసాగరం(చెరువు)లోకి చేపపిల్లలను బుధవారం విడుదల చేశారు. ఐటీడీఏ ద్వారా పంపిణీ చేసిన 1.90 లక్షల చేపపిల్లలను వట్టిగెడ్డ ప్రాజెక్టు చైర్మన్ మూడడ్ల సత్యంనాయుడు చేతులమీదుగా నీటిలోకి విడిచిపెట్టారు. మత్స్య సంపదను పెంచేందుకు రైతులను ప్రోత్సహిస్తూ ఈ చేపపిల్లల పెంపకం చేపట్టడం జరుగుతోందని సత్యంనాయుడు తెలిపారు. కార్యక్రమంలో ప్రాజెక్టు వైస్ చైర్మన్ ముంజేటి ప్రసాద్, పరజపాడు సర్పంచ్ గుంట్రెడ్డి రామకృష్ణ, ఎంపీటీసీ గుంట్రెడ్డి అన్నపూర్ణమ్మ తదితరులు పాల్గొన్నారు.

సదరం రీ వెరిఫికేషన్

సీతంపేట: గతంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్ల రీ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. స్థానిక ఏరియా ఆస్పత్రిలో బుధవారం ఆప్తాల్మిక్ కేసులను నేత్ర వైద్య నిపుణులు రేఖ పరిశీలించారు. వివిధ ప్రాంతాల నుంచి కంటికి సంబంధించిన వ్యాధులతో వచ్చిన వారికి పరీక్షలు చేశారు.

బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకుల అందజేత


బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కొత్తగూడ గ్రామంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఆరిక మాధవరావు ఇంట్లో మంగళవారం షార్ట్‌సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో ఇల్లు, ఇంటి సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఉదయం ఆ గ్రామం వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం ప్రమాదానికి గల కారణాల ను అడిగి తెలుసుకున్నారు. పరిహారం అందించే చర్య లపై తహసీల్దారు శివన్నారాయణకు ఎమ్మెల్యే పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.పద్మ, పి.సుదర్శనరావు పాల్గొన్నారు.

బాల కార్మికులను ప్రోత్సహించొద్దు


వ్యాపారస్తులకు బాలకార్మికులను ప్రోత్సహించవద్దని అవగాహన కల్పిస్తున్న లేబర్ అధికారి శ్రీనివాసరావు

పాలకొండ రూరల్: వ్యాపార సంస్థలు, వాణిజ్య కార్యకలాపాల్లో బాలకార్మిక వ్యవస్థను సంబంధిత యజమానులు ప్రోత్సహించ వద్దని పాలకొండ కార్మిక శాఖాధికారి ఆర్.వి.శ్రీనివాసరావు అన్నారు. చైల్డ్ లేబర్ రెస్క్యూ డ్రైవ్, యాక్సిస్ ఫర్ జస్టిస్ ఫర్ చిల్డ్రన్ (ఆప్ హోల్డ్ సంస్థ) సమన్వయంతో పట్టణంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఈ క్రమంలో హోటళ్లు, వస్త్ర, ఇతర వ్యాపార దుకాణ నిర్వాహకులకు చైల్డ్ యాక్ట్‌పై వివరించారు. మైనర్లను పనిలో పెట్టుకోవటం వలన చట్టపరంగా ఎదుర్కొనవలసిన కేసులు, సమస్యలపై అవగాహన కల్పించారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో సామాజికవేత్త తోట ప్రవీణ్‌కుమార్, కార్మిక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రోటోకాల్ ఉల్లంఘన సరికాదు

- వైఎస్సార్‌సీపీ హయాంలో అందరికీ సమన్యాయం
- మాజీ ఎమ్మెల్యే కళావతి


మాజీ ఎమ్మెల్యే కళావతితో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు

సీతంపేట: గ్రామాల్లో అభివృద్ధి చేస్తున్న పనుల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీలను విస్మరించి కూటమి ప్రభుత్వంలో అధికారులు ప్రోటోకాల్ ఉల్లంఘిస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. బుధవారం పలువురు ప్రజాప్రతినిధులు ఎంపీపీ కార్యాలయం ఆవరణలో మాజీ ఎమ్మెల్యే కళావతి వద్ద సమస్యలు ఏకరువు పెట్టారు. గత ఆరు నెలలుగా ఎలా ప్రోటోకాల్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారో వివరించారు. ఎటువంటి పదవులు లేని వారికి ఇచ్చిన ప్రాధాన్యత కూడా తమకు ఇవ్వడం లేదన్నారు. సర్పంచ్‌ల పాలనకు కొంతమంది రాజకీయ బ్రోకర్లు అడ్డు తగులుతున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇటువంటి వివక్షత లేకుండా అందరికి సమాన ప్రాతినిధ్యం ఇచ్చి సమన్యాయం చేశామన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రహదారులు, ఇతర పనులకు నిధులు మంజూరైతే రీ ఎస్టిమేషన్‌లు వేసి తామే ఈ పనులు తెచ్చామని కూటమి నాయకులు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. హౌసింగ్, పింఛన్‌ల విషయంలో తప్పుడోవ పట్టిస్తున్నారన్నారు. పార్టీలకతీతంగా హౌసింగ్ స్కీమ్ దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ప్రతీ ఒక్కరికి మంజూరు చేసిన ఘనత తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఏజెన్సీలో గతంలో మంజూరు చేసిన ఇళ్లకు ఇప్పుడు మోకాలడ్డడం తగదన్నారు. ఇప్పటికైనా పద్ధతులు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.ఆదినారాయణ, వైస్ ఎంపీపీ కుండంగి సరస్వతి, మండల పార్టీ కన్వీనర్ జి.సుమిత్రారావు, ఎస్‌టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హెచ్.మోహన్‌రావు, జెడ్‌పీ కోఆప్షన్ సభ్యులు ఎస్.లక్ష్మి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.